
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



నారాయణపేట

జిల్లా వార్తలు

బుధవారం 4 జూన్ 2025

ఉష్ణోగ్రతలు గరిష్ఠం: 33.0 కనిష్ఠం: 24.0

అవుట్ సోర్సింగ్
వెట్టి చాకిరీ
- అరకొర వేతనాలతో అవస్థలు 6
- జేపీఎస్, పీఎస్‌లతో సమానంగా పని

హమాలీ కాలనీలోకి మొసలి
- గద్వాల పట్టణంలో కలకలం 6

నేటి నుంచి రాష్ట్ర స్థాయి
బాస్కెట్‌బాల్ టోర్నీ

- 15 జిల్లాల నుంచి పాల్గొననున్న 120 మంది క్రీడాకారులు
- టోర్నీని ప్రారంభించనున్న రాష్ట్ర క్రీడాశాఖ సలహాదారు జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే యెన్నం



జిల్లా మహిళలు, పురుషుల జట్లు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం రాష్ట్ర స్థాయి క్రీడా సంబురానికి వేదిక కానున్నది. బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒకటవ తెలంగాణ అంతర్ జిల్లాల అండర్-23 3x3 మహిళలు, పురుషుల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో రెండు రోజుల పాటు ఈ పోటీలను నిర్వహించనున్నారు. బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మక్సూద్‌బిన్ అహ్మద్‌జాకీర్, ప్రధాన కార్యదర్శి నసూరుల్లా హైదర్ మహ్మద్ ఆధ్వర్యంలో టోర్నీకి ఏర్పాట్లు చేశారు. మహిళలకు చైతన్య, పురుషులకు లిటిల్ స్కాలర్స్ స్కూల్‌లో బస కల్పిస్తున్నారు. స్టేడియంలో భోజన వసతి ఏర్పాటు చేయనున్నారు.

15 జిల్లాల నుంచి క్రీడాకారులు

బాస్కెట్‌బాల్ టోర్నీలో రాష్ట్రంలోని 15 జిల్లాల నుంచి 120 మంది క్రీడాకారులు పాల్గొననున్నారు. మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్, మహబూబాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, హన్మకొండ, జగిత్యాల, నల్గొండ, సూర్యాపేట, మెదక్, మాల్కాజ్‌గిరి జట్లు తలపడనున్నాయి. బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభం కానున్న టోర్నీకి రాష్ట్ర క్రీడా శాఖ సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లాకొత్వాల్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. తెలంగాణ రాష్ట్ర బాస్కెట్‌బాల్ సంఘం అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, సెక్రటరీ పృధీశ్వర్‌రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, ఎంఐఎం ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ జాబేర్‌బిన్ సయీద్, ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్‌హాదీ పాల్గొననున్నారు.

పోటీల్లో పాల్గొననున్న ఉమ్మడి జిల్లా బాస్కెట్ టీమ్ ఇలా..

పురుషుల జట్టు..
అబ్దుల్ బాసిత్, రోహిత్, వివేక్, ఎస్.ఆదిత్యానారయణ్

మహిళల జట్టు..
భువనేశ్వరి, అర్పిత, ప్రియాంక, తనుశ్రీ

పూర్తయిన ఏర్పాట్లు

బాస్కెట్‌బాల్ టోర్నీకి జిల్లా కేంద్రంలోని ఇన్‌డోర్ స్టేడియంలో ఏర్పాట్లు పూర్తి చేశాం. 15 జిల్లాల నుంచి 120 మంది క్రీడాకారులు, 60 మంది సాంకేతిక నిపుణులకు బస, భోజన వసతి కల్పిస్తున్నాం. ఫ్లాష్‌లైట్ల వెలుగులో మ్యాచ్‌లు కొనసాగనున్నాయి. అందరి సహకారంతో టోర్నీని విజయవంతంగా నిర్వహిస్తాం.

- బాస్కెట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు మక్సూద్‌బిన్ అహ్మద్‌జాకీర్

పుట్టగొడుగుల్లా ప్రైవేట్ పాఠశాలలు

- అనుమతులు లేకుండానే ఏర్పాటు
- ఈ విద్యా సంవత్సరానికి 42 దరఖాస్తులు
- అందులో 19 స్కూళ్లకే అనుమతులు.. 23 తిరస్కరణ
- మామూళ్ల మత్తులో మండల విద్యాశాఖ అధికారులు



మహబూబ్‌నగర్‌లో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన ఓ ప్రైవేటు పాఠశాల

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రైవేటు పాఠశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. తమ పాఠశాలలో చేరితే నాణ్యమైన విద్య అందిస్తామని, ఐఐటీ, నీట్ వంటి పోటీ పరీక్షలకు ఇప్పటి నుంచే శిక్షణ ఇస్తామని విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయి. అనుమతులు లేకుండానే తెలంగాణ ప్రభుత్వం గుర్తింపు ఉందని కొందరు బోర్డులు ఏర్పాటు చేస్తే.. మరికొందరు ఏకంగా సీబీఎస్‌ఈ పాఠశాల అని రాసుకొని బ్రోచర్లు చేత పట్టుకుని విద్యార్థుల ఇళ్లకు వెళ్తున్నారు. విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మోసం చేస్తున్నారు.

అనుమతి లేకున్నా ఉన్నట్లు బోర్డులు

మహబూబ్‌నగర్ జిల్లాలో నూతన పాఠశాలలు, పై తరగతుల అనుమతుల కోసం విద్యాశాఖకు 42 దరఖాస్తులు వచ్చాయి. అందులో పత్రాలు సరిగా ఉన్న 16 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు డీఈవో, 3 ఉన్నత పాఠశాలలకు ఆర్‌జేడీ అనుమతులు ఇచ్చారని కార్యాలయ అధికారులు చెబుతున్నారు. మిగతా 23 పాఠశాలలకు సంబంధించి సకాలంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోకపోవడం, భవనాలు సరిగా ఉండకపోవడం, ఫైర్ సర్టిఫికెట్స్ లేనందున వాటి దరఖాస్తులు రిజెక్ట్ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. కానీ చాలా పాఠశాలలు అనుమతులు లేకున్నా ఉన్నాయని, మరి కొన్ని సీబీఎస్ఈ అనుమతి ఉందని భవనాల వద్ద బోర్డులు ఏర్పాటు చేసుకొని మోసం చేస్తున్నాయి. విద్యార్థుల తల్లిండ్రులు కొందరు అనుమతి పత్రాలు అడిగితే తమకు ఓపెనింగ్ పర్మిషన్ వచ్చిందని, త్వరలోనే అన్ని డ్యాక్యుమెంట్స్ వస్తాయని చెబుతున్నారని తెలుస్తోంది.

అనుమతి లేకుండా నడిపితే చర్యలు తప్పవు



విద్యాశాఖ అనుమతి ఉంటేనే పాఠశాలల్లో విద్యార్థులను చేర్చుకోవాలి. అనుమతి లేకుండా పాఠశాలలు కొనసాగిస్తే చర్యలు తప్పవు. జిల్లాలో 2025-2026 విద్యా ఏడాది కోసం 42 నూతన, అప్‌గ్రేడ్ కోసం దరఖాస్తులు వచ్చాయి. అందులో 16 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు, 3 ఉన్నత పాఠశాలలకు అనుమతులు వచ్చాయి. మిగితా 23 పాఠశాలలకు అనుమతులు ఇవ్వలేదు. వారు గతంలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఏమైన దరఖాస్తు చేసుకుంటే ఈ నెల 9లోపు డీఈవో కార్యాలయంలో సంప్రదించాలి. అనుమతి లేకున్నా ఓపెనింగ్ అనుమతి వచ్చిందని విద్యార్థులను చేర్చుకుంటే కఠిన చర్యలు ఉంటాయి.

- ఎ.ప్రవీణ్‌కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి, మహబూబ్‌నగర్

ఒక్క అనుమతితో మూడు నుంచి ఐదు వరకు బ్రాంచులు

మహబూబ్‌నగర్ పట్టణంలో ఒక పాఠశాలకు అనుమతి పొంది, మూడు నుంచి ఐదు వరకు బ్రాంచులు కొనసాగిస్తున్నారు. విషయం ఎంఈవోలకు తెలిసినా మామూళ్లు పుచ్చుకుని మిన్నకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మెట్టుగడ్డ సమీపంలోని వడ్డెర బస్తి ప్రాంతంలో గల ఓ పాఠశాలకు ఒక అనుమతి ఉండగా, మూడు బ్రాంచులు నిర్వహిస్తోంది. గీత హోటల్ సమీపంలో గల ఓ పాఠశాలకు కూడా ఒక అనుమతి మాత్రమే ఉండగా, మరో పాఠశాలను న్యూ ప్రేమ్‌నగర్‌లో కొనసాగిస్తోంది. శ్రీనివాస కాలనీలో ఉన్న ఒక పాఠశాలకు ఒక అనుమతి ఉండగా, ఏకంగా జడ్చర్ల, మహబూబ్‌నగర్ మర్లు ప్రాంతంలో సీబీఎస్‌సీ అనుమతి పొందినట్లు నూతనంగా పాఠశాలలు ఏర్పాటు చేసి, అడ్మిషన్లు ప్రారంభించారు. ఎస్‌వీఎస్ వెనకాల ఓ కార్పొరేట్ పాఠశాలకు అసలు అనుమతి లేదు. కానీ అందులో అడ్మిషన్లు పూర్తయ్యాయని, నో అడ్మిషన్ బోర్డు పెట్టడం పరిస్థితిని తెలుపుతుంది.

మూడు నెలల బియ్యానికి క్యూ

ఒకేసారి మూడు నెలలకు సంబంధించి రేషన్ బియ్యం పంపిణీ చేస్తుండటంతో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని రేషన్ దుకాణాల వద్ద లబ్ధిదారులు బారులు తీరుతున్నారు. మూడు నెలలకు సంబంధించి బియ్యం ఇస్తుండటంతో మూడు సార్లు థంబ్ వేయాల్సి వస్తోంది. ఇంటర్‌నెట్ సమస్య వల్ల థంబ్ వేసినా ఒక్కోసారి ఫెయిల్ అవుతుండటంతో ఒక్కొక్కరికి బియ్యం ఇచ్చేందుకు 15 నుంచి 20 నిముషాల సమయం పడుతోంది. దాంతో గంటల తరబడి వరుసలో నిల్చొని, బియ్యం తీసుకెళ్లాల్సి వస్తోంది.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటో గ్రాఫర్, మహబూబ్‌నగర్



మహబూబ్‌నగర్‌లోని పీర్లగుట్టలో గల రేషన్ షాపు వద్ద బారులు తీరిన లబ్ధిదారులు

క్లిక్.. క్లిక్..



మహబూబ్‌నగర్‌లోని ఓ దుకాణంలో బియ్యం తూకం వేస్తున్న డీలర్



మహబూబ్‌నగర్‌లోని పాత పాలమూరులో గల ఓ దుకాణం వద్ద బియ్యం కోసం వరుసలో నిలుచున్న లబ్ధిదారులు

మరో వడ్డీ వ్యాపారి అదృశ్యం?
- రూ. 3 కోట్ల వరకు అప్పులు చేసినట్లు ప్రచారం 7

నల్లమల గుండం దారిలో పెద్దపులి
- సఫారీ పర్యాటకులకు కనువిందు 6

అనన్య సామాన్యం

- ఆసియా వాలీబాల్ టోర్నీకి ఎంపికైన మక్తల్ క్రీడాకారిణి
- భారత మహిళా జట్టులో చోటు
- అవకాశాలను అందిపుచ్చుకుంటూ అంతర్జాతీయ స్థాయికి..
- ఆల్ ఇండియా ఉమెన్స్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నీలో బంగారు పతకం కైవసం

7



వాలీబాల్‌తో అనన్య

నేతన్నకు భరోసా

- చేనేత, అనుబంధ కార్మికులకు అందనున్న ప్రోత్సాహకం
- నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని 1,860 మంది కార్మికులకు లబ్ధి

నారాయణపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేతన్న భరోసా పథకం కింద నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని 1,860 మంది కార్మికులకు లబ్ధి చేకూరనుంది. ఈ నెల 2న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ పథకానికి సంబంధించిన మార్గదర్శకాలు చేశారు. నారాయణపేట జిల్లాలో 622 మగ్గాలు, మహబూబ్‌నగర్ జిల్లాలో 188 మగ్గాలు, తాత్కలిక మగ్గాలు 120 మొత్తం 930 జియో ట్యాగింగ్ చేసినవి ఉన్నాయి. పథకం కింద జియో ట్యాగింగ్ చేసిన మగ్గాలపై పని చేస్తున్న కార్మికులకు ఏడాదికి గరిష్ఠగా రూ.18,000, అనుబంధ కార్మికులకు వేతన ప్రోత్సాహకం కింద రూ.6,000 అందించనున్నారు. ఏడాదిలో రెండు సార్లు కార్మికుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులను జమ చేస్తారు. 18 ఏళ్లు నిండి, జియో ట్యాగింగ్ చేసిన మగ్గాలపై పని చేస్తూ వార్షిక ఆదాయంలో కనీసం 50 శాతం వృత్తిద్వారా పొందుతున్న వారు అర్హులు. ప్రోత్సాహకం అందనుండటంతో ముడి సరుకులు, యార్న్ కొనుగోలుకు ఆర్థికంగా కలిసి వస్తుందని కార్మికులు చెబుతున్నారు.



నారాయణపేటలో మగ్గం నేస్తున్న కార్మికుడు

నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలి: కలెక్టర్



అధికారులతో సమీక్ష చేస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసిత కుటుంబాలకు ఆర్ అండ్ ఆర్ కింద కేటాయించిన స్థలంలో చేపట్టిన వసతుల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే ల్యాండ్ రికార్డ్స్, సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉదండపూర్ రిజర్వాయర్ కింద ఇళ్లు కోల్పోయిన నిర్వాసిత కుటుంబాలకు, అవార్డు అందుకున్న వారందరికీ పునరావాసం కింద చేపట్టిన వసతుల నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ ఎస్.మోహన్ రావు, భూసేకరణ ప్రత్యేక కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఆర్డీవో నవీన్, ఇరిగేషన్, మిషన్ భగీరథ, సర్వేల్యాండ్ రికార్డ్స్ అధికారులు పాల్గొన్నారు.

ముసాయిదా నేడు విడుదల

- కొత్త పురపాలికలు, నగర పాలికలో వార్డుల విభజనపై నేడు జాబితా
- పాలమూరు కార్పొరేషన్‌లో 60 డివిజన్లు.. దేవరకద్రలో 12 వార్డులు



పాలమూరు నగర పాలక సంస్థ కార్యాలయం

మహబూబ్‌నగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కొత్తగా ఏర్పాటైన దేవరకద్ర, మద్దూర్ మునిసిపాలిటీలతోపాటు మహబూబ్‌నగర్ నగరపాలక సంస్థలో వార్డుల విభజన ముసాయిదా మంగళవారం విడుదల కావాల్సి ఉండగా, బుధవారానికి వాయిదా పడింది. పాలమూరు నగర పాలక సంస్థలో రాత్రి ఏడు గంటలకు ప్రచురిస్తారని చెప్పినా జాబితా తయారీకి అధికారులు మల్లగుల్లాలు పడుతున్నందున జాప్యం జరిగినట్లు తెలుస్తోంది. వార్డుల విభజనపై అభ్యంతరాలు, సలహాల కోసం ముసాయిదా విడుదల కానుండటంతో ఆయా పురపాలికలు, పాలమూరు నగర పాలికలో రాజకీయ సందడి నెలకొంది.

అందరిలో టెన్షన్

పాలమూరు కార్పొరేషన్‌లో 49 వార్డులు ఉండగా ఇప్పుడు 60 డివిజన్‌లు అయ్యాయి. ఇప్పటికే అధికారులు అందుకు సంబంధించిన జాబితా రూపొందించారు. పాత మునిసిపాలిటీతోపాటు కొత్తగా 3 వేల ఓటర్లున్న జైనల్లీపూర్, దివిటిపల్లి గ్రామ పంచాయతీలను నగర పాలక సంస్థలో విలీనం చేశారు. ఇదివరకు ఒక్కో వార్డుకు 3,200-3,900 వరకు ఓటర్లు ఉండగా, కార్పొరేషన్‌లో మాత్రం ఓటర్ల సంఖ్య తగ్గుతోంది. ఓటర్లు పెద్దగా పెరగకపోగా డివిజన్‌లు మాత్రం 11 పెరగడంతో సగటున ఒక్కో డివిజన్‌కు 3,200-3,300 ఓటర్లకన్నా మించి ఉండే పరిస్థితి లేదు. డివిజన్‌ల సంఖ్య పెరగడంతో ఇదివరకు కౌన్సిలర్‌లుగా ఉన్నవారితోపాటు కొత్తగా పోటీ చేయాలనుకునే ఆశావహుల్లో తమ వార్డు ఏమైనా మారిందా అన్న టెన్షన్ నెలకొంది. జాబితా కోసం అంతా ఎదురుచూస్తున్నారు. దేవరకద్రను 12 వార్డులుగా విభజించారు. ఒక్కో వార్డులో 810-870 వరకు ఓటర్లు ఉన్నారు. దేవరకద్ర గ్రామ పంచాయతీ ఓటర్లను 7 వార్డులుగా, చౌదర్‌పల్లిని 2 వార్డులుగా విభజించారు. రెండో వార్డులో కొంతభాగం దేవరకద్ర కలిసింది. 3 నుంచి 7, అదేవిధంగా 10, 11 వార్డులు దేవరకద్ర వార్డులు ఉండగా, పెద్ద గోప్లాపూర్, మీనుగోనిపల్లి, బల్సుపల్లి గ్రామాలను ఒక్కో వార్డుగా విభజించారు. వార్డుల జాబితా వెలువడటంతో ఆశావహులు తమకు అనుకూలతలు, ప్రతికూలతలను లెక్కలేసుకునే పనిలో పడ్డారు. ప్రజలనుంచి అభ్యంతరాలు, సలహాలు స్వీకరించేందుకు గడువు ఉండటంతో కొన్ని మార్పులు చేర్పులు జరిగే అవకాశం లేకపోలేదు. ఈనెల 21న ఫైనల్ నోటిఫికేషన్ వెలువడనుంది.

కొనసాగుతున్న జల విద్యుత్ ఉత్పత్తి 7

అవుట్ సోర్సింగ్ వెట్టి చాకిరీ

- అరకొర వేతనాలతో అవస్థలు
- జేపీఎస్, పీఎస్‌లతో సమానంగా పని
- జిల్లాలో 39 మంది అవుట్ సోర్సింగ్ కార్యదర్శులు



గ్రామ పంచాయతీ కార్యాలయం

మహబూబ్‌నగర్ న్యూటౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ కార్యదర్శులతో సమానంగా విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు అరకొర వేతనాలతో అవస్థలు పడుతున్నారు. 2017లో ఔట్ సోర్సింగ్ విధానంలో నియమితులైన కార్యదర్శులు కనీస వేతనం లేక వెట్టి చాకిరీ చేస్తున్నారు. వారికి నెలకు రూ. 12,600 నుంచి రూ. 15 వేల వరకు చెల్లిస్తున్నారు. అది కూడా నెలనెలా ఇవ్వడం లేదు. ఏజెన్సీలు వారికి మూడు, నాలుగు నెలల కోసం వేతనాలు ఇస్తున్నారు. దీంతో కుటుంబ పోషణ భారంగా మారుతోంది. మహబూబ్‌నగర్ జిల్లాలో 33 మంది ఔట్ సోర్సింగ్ కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారు. గతంలో ప్రభుత్వం ఖాళీలుగా ఉన్న పంచాయతీ కార్యదర్శుల పోస్టులను ఔట్ సోర్సింగ్ కార్యదర్శులతో భర్తీ చేసింది. తాజాగా నోటిపై చేసిన గ్రామాల ఖాళీల్లో ఔట్ సోర్సింగ్‌లో రెండేళ్ల సర్వీసు పూర్తి చేసిన కార్యదర్శులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

18 నెలలుగా నిధులు లేవు

గ్రామ పంచాయతీలలో సర్పంచుల పదవీ కాలం గత ఏడాది జనవరి 31న ముగిసింది. అప్పటి నుంచి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. అప్పటిదాకా రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోయినా, కేంద్రం ఇచ్చిన 15వ ఆర్థిక సంఘం నిధులతో కార్యదర్శులు నెట్టుకొచ్చారు. ప్రత్యేక అధికారుల పాలన సాగుతుండడంతో కేంద్రం కూడా 15వ ఆర్థిక సంఘం నిధులను నిలిపి వేసింది. దీంతో ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా మారింది. జేపీఎస్‌లు, పీఎస్‌లు పంచాయతీల్లో తమ పలుకుబడితో ఎంతో కొంత మేర అప్పులు తెచ్చి పాలన సాగిస్తున్నారు. ఔట్ సోర్సింగ్ కార్యదర్శులు మాత్రం అవస్థలు పడుతున్నారు

నిధులు విడుదల అయితేనే...



రాష్ట్ర పంచాయతీ శాఖ నుంచి మండలాలకు నిధులు విడుదల అయితే, ఎంపీడీవోలు బిల్లులు చేసి ఏజెన్సీలకు చెల్లిస్తారు. ఔట్ సోర్సింగ్ కార్యదర్శుల వేతనాల్లో వ్యత్యాసాలు ఏమీ లేవు. అన్ని చోట్ల ఒకే వేతనం అమలులో ఉంది. వారిని రెగ్యులర్ చేయాలనే డిమాండ్ ఉన్నా, అది ప్రభుత్వ పరిధిలో ఉంటుంది.

పార్థసారథి, డీపీవో

జిల్లాకో తీరు వేతనం

జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం నెలకు రూ 28,719 వేతనం చెల్లిస్తుండగా, ఔట్ సోర్సింగ్ కార్యదర్శులకు నెలకు రూ. 12.600 మాత్రమే చెల్లిస్తున్నారు. దీనికి తోడు వారి వేతనాలు జిల్లాకో తీరున ఉన్నాయి. కొన్ని జిల్లాలో నెలకు రూ. 15 వేలు, మరికొన్ని జిల్లాల్లో రూ. 10,600 ఇస్తున్నారు. ఇంకొన్ని చోట్ల రూ. 12.500 చెల్లిస్తున్నా రు. ఇలా ఏజెన్సీలు ఇష్టానుసారంగా వేతనాలు ఇస్తూ వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. అది కూడా ప్రతీ నెల ఇవ్వక పోవడం సమస్యగా మారింది.

మాజీ సర్పంచుల ఒత్తిడి

తమ హయాంలో చేసిన పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులను మంజూరు చేయించాలని మాజీ సర్పంచులు ఔట్ సోర్సింగ్ కార్యదర్శులపై ఒత్తిడి తెస్తున్నారు. 15వ ఆర్థిక సంఘం, స్టేట్ ఫైనాన్స్ నిధులు రాక గ్రామాల్లో అభివృద్ధి కుంటుబడి కార్యదర్శులు అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు మాజీల సర్పంచుల ఒత్తిడులు పెరగడంతో ఔట్ సోర్సింగ్ కార్యదర్శులు మొఖం చాటేసే పరిస్థితి నెలకొన్నది. వసూలవుతున్న పన్నులు గ్రామ పాలనకు ఏ మాత్రమూ సరిపోక పోవడంతో కార్యదర్శులు మానసిక ఒత్తిడిలకు గురవుతున్నారు.

సీఎంఆర్ క్లియర్ చేయాలి

- రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డీఎస్ చౌహాన్

వనపర్తి రాజీవ్ చౌరస్తా, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో ఉన్న రైస్ మిల్లులు సగానికి పైగా డిఫాల్ట్ కావడం ధాన్యం సేకరణకు ప్రధాన సమస్యగా మారిందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డీఎస్ చౌహాన్ అన్నారు. మంగళవారం ఉదయం వనపర్తి కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలుపై వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లా అధికారులు, మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ప్రిన్సిపల్ సెక్రటరీ డీఎస్ చౌహాన్, కలెక్టర్ ఆదర్శ్ సురభి, నాగర్‌కర్నూల్, వనపర్తి అదనపు కలెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్ చౌహాన్ మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు విషయంలో రాష్ట్రంలో ఎక్కడా లేని సమస్య నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలో ఎందుకు వస్తోందన్నారు. దీనికి ప్రధాన కారణం రెండు జిల్లాల్లో సగానికి పైగా డిఫాల్ట్ కావడం ఏంటని విస్మయం వ్యక్తం చేశారు. వనపర్తి జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్రంలో రికార్డుస్థాయిలో ధాన్యం ఉత్పత్తి అయితే మిల్లింగ్ చేయడానికి మిల్లులు లేకపోతే మిల్లింగ్ ఎవరు చేస్తారని ప్రశ్నించారు. తాత్కాలికంగా గోదాములో నిల్వ చేసినప్పటికీ అంతిమంగా మిల్లులకు చేరాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రభుత్వం నుంచి ధాన్యం తీసుకోకుండా ప్రైవేటు ధాన్యం తీసుకొని మిల్లింగ్ చేస్తున్న డిఫాల్ట్ మిల్లులపై చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. డిఫాల్ట్ మిల్లర్లు పాత సీఎంఆర్‌ను క్లియర్ చేసి ప్రభుత్వం నుంచి ధాన్యం తీసుకోవడానికి ముందుకు రావాలని సూచించారు. వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ... 10 సంవత్సరాల్లో ఏ సీజన్‌లోనూ లేని విధంగా ఈ సారి జిల్లాలో అత్యధికంగా దిగుబడి వచ్చిందని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 2.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.571 కోట్లు 39,145 రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. జిల్లాలో 184 మిల్లులకు గాను డిఫాల్ట్ మిల్లులు పోను కేవలం 77 మిల్లులకు మాత్రమే ధాన్యం కేటాయించామని, అయినప్పటికీ సజావుగా కొనుగోలు చేయడం జరుగుతోందని తెలిపారు. సమీక్షలో వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, నాగర్‌కర్నూల్ అదనపు కలెక్టర్ అమరేందర్, వనపర్తి సివిల్ సప్లయ్ అధికారి విశ్వనాథ్, డీఎంలు జిల్లా అధికారులు, మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ట్రాన్స్‌ఫోర్టు కాంట్రాక్టర్‌లు ఉన్నారు.

చెంచు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానం

- ఐనోలు గురుకుల ప్రిన్సిపాల్ కే పుష్పలత

అచ్చంపేట రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని హయ్యత్‌నగర్ పీవీటీజీ గురుకుల సీవోఈ (కాలేజీ ఆఫ్ ఎక్స్‌లెన్స్)లో చేరేందుకు చెంచు విద్యార్థుల (బాల, బాలికలు) నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట మండలం ఐనోల్ గిరిజన బాలికల గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ కే.పుష్పలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 5వ తేదీలోగా మన్ననూర్ పీవీటీజీ గిరిజన గురుకులంలో దరఖాస్తు ఫారాలను తీసుకుని భర్తీ చేసి అక్కడే అందించాలని సూచించారు. పదవ తరగతి పాసైన విద్యార్థులకు సీవోఈ కాలేజీలో నేరుగా సీటు లభిస్తుందని తెలిపారు. సీఈవోలో సైన్స్ గ్రూప్ విద్యార్థులకు నీట్, ఎప్‌సెట్, జేఈఈ మెయిన్స్, జేఈఈ అడ్వాన్స్‌డ్ ప్రవేశ పరీక్షలకు శిక్షణనిస్తారని తెలిపారు. ఆర్ట్స్ గ్రూప్ విద్యార్థులకు సీఎంఏ, క్లాట్ కోర్సులకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు.

ఆర్ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మన్ననూర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలోని పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఆర్ఐటీఐ)లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆర్ఐటీఐ ప్రిన్సిపాల్ లక్ష్మణ స్వామి తెలిపారు. కోపా, ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్‌మెన్, సివిల్, ఫిట్టర్, మెకానిక్, మోటార్ వెహికల్, ఏటీసీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు. పదో తరగతి పాసైన వారు దరఖాస్తు చేసుకోవాలని, ఐటీఐ తెలంగాణ వెబ్‌సైట్‌ను సందర్శించి దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు.

హమాలీ కాలనీలోకి మొసలి

- బంధించిన ఫారెస్ట్ అధికారులు
- గద్వాల పట్టణంలో కలకలం


హమాలీ కాలనీలోకి ప్రవేశించిన మొసలి

గద్వాల న్యూటౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని హమాలీ కాలనీలోకి ఓ మొసలి ప్రవేశించడం కలకలం సృష్టించింది. ఈ సంఘటన మంగళవారం తెల్లవారుజామున జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హమాలీ కాలనీలో నివాసం ఉంటున్న తిరుపతి ఇంటి సమీపంలోకి మొసలి వచ్చింది. దీంతో కుక్కలు పెద్దగా మొరగడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు బయటకు వచ్చి చూడటంతో అది కనిపించింది. వెంటనే చుట్టు ప్రక్కల వారికి చెప్పడంతో వారు మొసలిని తాడుతో బంధించారు. అనంతరం ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు మొసలిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కాలనీలోకి మొసలి రావడం ఇది రెండవసారి కావడంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు.

నల్లమల గుండం దారిలో పెద్దపులి

- సఫారీ పర్యాటకులకు కనువిందు


గుండం దారిలో వెళుతున్న పెద్దపులి

మన్ననూర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూలు జిల్లా పరిధిలోని అమ్రాబాద్ పులుల అభయారణ్యంలో ఓ పెద్దపులి కనిపించింది. కొందరు పర్యాటకులు మంగళవారం సఫారీ వాహనంలో పర్హాబాద్ చౌరస్తా నుంచి గుండం వైపు పోతుండగా, కొంచెం ముందు ఓ పెద్దపులి వెళ్తూ కనిపించింది. దీంతో డ్రైవర్ వాహనాన్ని అక్కడే నిలిపివేశాడు. పర్యాటకులు పెద్దపులిని తమ మొబైల్‌ఫోన్లలో ఫొటోలు, వీడియోలు తీసుకొని సంబురపడ్డారు. వాటిని సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసుకున్నారు. అరుదైన పెద్దపులి కనిపించిందని ఆనందం ఓ వైపు.. అంత దగ్గరగా దాన్ని చూసినందుకు భయం మరో వైపు అనుకున్నారు. పెద్దపులి కనిపించిన విషయం వాస్తమని డీఎఫ్‌వో రోహిత్ గోపిడి నిర్ధారించారు. ఇటీవలి కాలంలో సఫారీ టూర్‌కు వచ్చే పర్యాటకులకు, విధుల్లో ఉండే అటవీశాఖ అధికారులకు పెద్దపులులు తరుచూ కనిపిస్తున్నాయి.

సాగు సంబురం..


ఎద్దులతో పొలం దున్నుతున్న రైతు

అలంపూరు చౌరస్తా, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ముందస్తు వానలు రైతుల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతున్నాయి. గతేడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది జోగుళాంబ గద్వాల జిల్లాలో సాగు వి స్తీర్ణం పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారిక లెక్క లు చెబుతున్నాయి. ఇందులో ప్రధానంగా పత్తి, వరి సాగు గణనీయంగా పెరగనుంది. కాంప్లె క్స్ ఎరువులు రైతుల అవసరాల మేరకు ప్రతిపాదనలు పెట్టినట్లు జిల్లా వ్యవసాయ సంచాలకులు సక్రియనాయక్ తెలిపారు.

పత్తి సాగు వైపు మొగ్గు..

సాధరణంగా నడిగడ్డ ప్రాంతంలో పత్తి, వరి, మొక్కజొన్న, మిర్చి, కంది పంటలకు పెట్టింది పేరు. గతంతో పోల్చితే ఈ ఏడాది పత్తి సాగు వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. గతేడాది కమర్షియల్ పంటలైన పొగాకు, మిర్చి పంటలను సాగు చేయని రైతులు కూడా సాగు చేసి నష్టపోయారు. గతేడాది పత్తికి కేంద్రం మద్దతు ధర కల్పించి సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం, తాజాగా ఈ ఏడాది మద్దతు ధర రూ.589లు పెంచడంతో పత్తిసాగు మరింత పెరిగే అవకాశం ఉంటుంది. ఇక వరి కేంద్రం మద్దతు ధరతో పాటు సన్నరకాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 500బోనస్ ఇస్తుండంతో వరి సాగుకు మొగ్గు చూపుతున్నారు.

ఏ పంటలు ఎంత విస్తీరణంలో..

అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో 2024 వానాకాలంలో పత్తి 1.33లక్షలు సాగు చేయగా వరి 89.7వేల ఎకరాలు, మొక్కజొన్న 11వేలు, వేరుశనగ 12వేలు, కందులు 46.9వేలు, మిర్చి సుమారు 60వేలు, పొగాకు 11వేలతో పాటు జొన్న, ఆముదం, నువ్వులు, జూటు తదితర పంటలతో మొత్తం 3.08లక్షల ఎకరాలు సాగు చేశారు. ఈ ఏడాది వానాకాలంలో పత్తి 1.42లక్షలు సాగు చేస్తుండగా, వరి 95వేల ఎకరాలు, మొక్కజొన్న 13వేలు, వేరుశనగ 11వేలు, కందులు 42వేలు, పొగాకు 10వేలు, మిర్చి 30వేల ఎకరాలతో పాటు వివిధ పంటల సాగు ఈ ఏడాది సుమారు 3,67,000 ఎకరాలు సాగుకు సిద్ధం అవుతోంది.

1.18 మెట్రిక్ టన్నుల ఎరువులకు ప్రతిపాదన

జిల్లాలో సుమారు 3,67,000 ఎకరాలకు సాగు విస్తీర్ణం పెరగనున్న నెపథ్యంలో సుమారు 1.18మెట్రిక్ టన్నులు ఆవసరమని అధికారులు అంచన వేసి ప్రతిపాదనలు పంపారు. అదేవిధగా పత్తి 641 క్వింటాళ్ల విత్తనాలు, వరి 23,940క్వింటాళ్లు, మొక్కజొన్న 1,030 క్వింటాళ్లు, మిర్చి 30క్వింటాళ్లు, కందులు 1,700 క్వింటాళ్లు, వేరుశనగ 6,708 క్వింటాళ్లు, మినుములు 464 క్వింటాళ్ల విత్తనాలు ఆవసరమని అధికారులు గుర్తించారు.

రైతుల్లో ఉత్సాహం

ముందస్తు వానలతో గతంలో ఎన్నడూ లేని విధంగా మే నెలలోనే విత్తనాలు నాటేందుకు రైతులు ఉత్సహం చూపుతున్నారు. గతేడాది ముందస్తు విత్తనం వేసిన పత్తి రైతులకు మంచి దిగుబడి రావడంతో ఈ ఏడాది కూడా ముందే సాగు చేసేందుకు ఉత్సహం చూపుతున్నారు. ఇప్పటికే జిల్లాలో సుమారు 20వేల ఎకరాల్లో పత్తి విత్తనాలు నాటారు. ఇంకా 1.15లక్షల ఎకరాలు సాగు చేయాల్సి ఉంది.

ఈ ఏడాది అత్యధికంగా అయిజలో పత్తి 25వేల ఎకరాలు సాగు అవుతుండగా, రెండోస్థానంలో మల్దకల్ 20,150 ఎకరాలు, అత్యల్పంగా అలంపూరులో 1,400వందల ఎకరాలు సాగు చేయనున్నట్లు తెలుస్తోంది. నడిగడ్డ ప్రాంతంలోని ముఖ్యంగా మానవపాడు, ఉండవల్లి, ఇటిక్యాల, వడ్డేపల్లి, రాజోలి మండలాల్లో మిర్చి వీపరితంగా సాగు చేసేవారు. గతంలో తీవ్రంగా నష్టపోయిన మిరిచ్చ రైతులు ఈ ఏడాది పూర్తిగా తగ్గించే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచన వేస్తున్నారు.

సాగుకు సమయం ఉంది



ముందస్తు వానలతో రైతులు తొందరపడరాదు. 50ఎంఎం వర్షం కురిసినప్పుడే విత్తనానికి అనుకులంగా ఉంటుందని, అంతకంటే తక్కువ వర్షం నమోదు అయితే విత్తకపోవడమే మంచిది. గ్రామాల్లోకి వచ్చి విక్రయించే ఎరువులను కొనేముందు ఆలోచించాలి. కమర్షియల్ పంటలే కాకుండా పప్పుదినుసుల వైపు కూడా రైతులు ఆసక్తి చూపాలి.

- జిల్లా వ్యవసాయ సంచాలకులు సక్రియనాయక్

తాగునీటి కోసం తిప్పలు

- ఓవర్‌హెడ్ ట్యాంకుపైకి ఎక్కిప్రాణాలతో చెలగాటం


ధరూర్ మండల కేంద్రంలో ఓవర్‌హెడ్ ట్యాంకు పైకి ఎక్కి నీటిని తెచ్చుకుంటున్న మహిళలు

ధరూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల కేంద్రంలో గుక్కెడు నీటి కోసం ప్రజలు ఓవర్‌హెడ్ ట్యాంకుపైకి ఎక్కి ప్రాణాలతో చెలగాటమాడిన సంఘటన మంగళవారం చోటుచేసుకున్నది. తాగునీరు సరఫరా చేసే మిషన్ భగీరథ నీటి ట్యాంకును శుభ్ర పరిచేందుకు రెండు రోజులుగా నీటి సరఫరాను నిలిపివేశారు. దీంతో మంగళవారం ధరూర్ మండల కేంద్రానికి చెందిన కురువ వీధిలో ఏరువాక పౌర్ణమితో పాటు గొర్రెలకు సంబంధించి సల్లకుండ పండుగను నిర్వహించుకున్నారు. ఉదయం కాలనీలో పండగ జరుగుతుండటంతో తాగునీటి సమస్య తలెత్తింది. దీంతో ఆ కాలనీవాసులు అక్కడే ఉన్న నీటి ట్యాంకుపైకి ఎక్కారు. దాదాపు ఆరుగురు మహిళలు ట్యాంకు నుంచి నేరుగా నీటికి బిందెలతో తీసుకువచ్చారు. ఆ సమయంతో అదే కాలనీకి చెందిన కొందరు యువకులు ఫొటోలను తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. ప్రాణాలకు ప్రమాదం ఉన్నా గుక్కెడు నీటి కోసం మహిళలు సాహసం చేయాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం గ్రామ కార్యదర్శి, సిబ్బంది ట్యాంకు వద్దకు చేరుకున్నారు.

అప్పటికే స్థానికంగా ఉన్న మహిళలు లేకపోవడంతో ఎవరైనా ట్యాంకు పైకి ఎక్కి నీటిని తీసుకోరాదని, ప్రమాదాలు సంభవించే ప రిస్థితి ఉన్నదని హెచ్చరించారు.

గోపన్‌పల్లిలో ఎల్లమ్మ బోనాలు


బోనాలతో మహిళలు

దేవరకద్ర, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోపన్‌పల్లిలో మంగళవారం ఎల్లమ్మ దేవతకు బోనాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవా రికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు బోనాలతో ఊరే గింపుగా ఆలయానికి చేరుకొని అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకు న్నారు. గ్రామస్థులు నాగిరెడ్డి, నవీన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, శ్రీను వాసులు, బుచ్చన్న రాములు పాల్గొన్నారు.

అక్రమ కేసు తొలగించాలి

- బీఎస్పీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జి.గంగాధర్


మాట్లాడుతున్న బీఎస్పీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జి.గంగాధర్

పాలమూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : బీఎస్పీ రాష్ట్ర కమిటీ సభ్యుడు బండి పృథ్వీరాజ్‌పై పోలీసులు పెట్టిన ఆధారాలు లేని అక్రమ కేసును తొలగించాలని బీఎస్పీతెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జి.గంగాధర్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో నిరంతరం ప్రజల మధ్య ఉంటూ పనిచేస్తున్న బీఎస్పీ నాయకుడిపై అక్రమ కేసు బనాయించడం సరికాదన్నారు. సమస్యలపై పాలకులను ప్రశ్నిస్తున్నందుకే అక్రమ కేసు బనాయించారని తెలిపారు. ప్రజల గొంతుకగా ఉన్న బీఎస్పీ నాయకులపై వేధింపులు ఆపాలన్నారు. జిల్లా అధ్యక్షుడు రాంచందర్, శ్రీనివాస్, ఎండీ ముజఫర్, సంతోష్‌రెడ్డి, సుధాకర్, కృష్ణంరాజు, దశరథ్, మహేష్ పాల్గొన్నారు.

గిరిజన రైతులపై ఫారెస్టు అధికారుల వేధింపులు ఆపాలి

- తెలంగాణ రైతు సంఘం డిమాండ్


మాట్లాడుతున్న తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి బాలపీరు

కొల్లాపూర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ మండల పరిధిలోని నల్లమల గ్రామాలలో పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులపై అటవీ అధికారుల వేధింపులు ఆపాలని తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి బాలపీరు డిమాండ్ చేశారు. కొల్లాపూర్ మండల పరిధిలో గేమ్యా నాయక్ తండా తెలంగాణ రైతు సంఘం నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా బాలపీరును ఎన్నుకున్నారు. గేమ్యా నాయక్ తండా అధ్యక్షుడిగా బాష, కార్యదర్శిగా సాయికృష్ణ, ఉపాధ్యక్షులుగా టీక్య నాయక్, రాముడు, బాలు నాయక్, దేన్య నాయక్, సహాయ కార్యదర్శి మేత్రియ సాలమ్మ, పత్తి జేజయ్య నా యక్‌లతో పాటు 15 మంది సభ్యులతో కూడిన కమిటీని ఎన్నుకున్నారు. బాలపీరు మాట్లాడుతూ కొన్నేళ్లుగా రైతులు సాగు చేస్తున్న భూములకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని ఆయన కోరారు. పోడు అటవీ భూములు సాగు చేసు కుంటున్నా రైతులపై అటవీ అధికారులు వేధింపులు తక్షణమే ఆపాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బాలు నాయక్, బాషానాయక్, సాయికృష్ణ, టీక్య నాయక్, బాషా నాయక్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంఘాల నాయకులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్


రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న ప్రజా సంఘాలు, ప్రతిపక్ష పార్టీల నాయకులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని దేవకీ ఫంక్షన్‌హాలులో బీఎస్పీ ఆధ్వర్యంలో దళిత, ప్రజా సంఘాలు, ప్రతిపక్ష పార్టీల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బోనాసి రామచందర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో బీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి చింత సత్తి, సీపీయూఎస్ఐ జిల్లా అధ్యక్షుడు మిద్దె రాములు, బీఆర్ఎస్‌పీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి నరిగే నరేందర్, మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు వంగూరి జయశంకర్, సామాజిక ఉద్యమకారుడు వావిలాల రాజశేఖర్‌శర్మ, ముస్లిం హక్కుల సమితి అధ్యక్షుడు నిజాం, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పి డికిళ్ల శ్రీనివాసులు, బీఎంపీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి గడ్డం విజయ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు ప్రమోద్‌కుమార్, దళిత సమాఖ్య అధ్యక్షుడు ఎదిరేపల్లి కాశన్న పాల్గొని దళిత ప్రజా సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు, సామాజిక కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులను ముక్త కంఠంతో ఖండించారు. అదేవిధంగా బీఎస్పీ రాష్ట్ర ఈసీ మెంబరు పృథ్వీరాజ్‌పై రాజకీయ కక్షతో పెట్టిన కేసును వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రజా ఉద్యమకారులపై కేసులు పెడితే కేసీఆర్ ప్రభుత్వానికి పట్టిన గతే రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి పట్టడం ఖాయమని వారు హెచ్చరించారు.

కార్యక్రమంలో బీఎస్పీ నాగర్‌కర్నూల్ అసెంబ్లీ ఇన్‌చార్జి కొత్తపల్లి కుమార్, జిల్లా ఇన్‌చార్జి బీసమోళ్ల యోసేఫ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంతటి నాగన్న తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల జట్టుకు రెండో విజయం


విజయం సాధించిన జడ్చర్ల క్రికెట్ జట్టు

- తడబడిన నారాయణపేట జట్టు

జడ్చర్ల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా అండర్- 19 క్రికెట్ పో టీలు జడ్చర్ల మినీ స్టేడియంలో కొనసాగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం నిర్వహించిన పోటీల్లో గద్వాల జట్టుపై జడ్చర్ల జట్టు ఘన విజయం సాధించింది. మంగళవారం నారాయణపేట జడ్చర్ల జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన జడ్చర్ల జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 285 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జడ్చర్ల జట్టులో హర్షిత్ 60, విగ్నేష్ 49 పరుగులు సాధించారు. నారాయణపేట బౌలర్ విష్ణు 3 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన నారాయణపేట జట్టు లక్ష్యం ఛేదించడంలో తడబడింది. బ్యాట్స్‌మెన్లు అందరూ వరుసగా పెవిలియన్ బాట పట్టడంతో ఎండీ యూసుఫ్ ఒంటరి పోరాటం చేయాల్సి వచ్చింది. జట్టులో అతడొక్కడే 67 పరుగులు సాధించాడు. జడ్చర్ల బౌలర్ అక్షయ్‌సాయి 5 వికెట్లు పడగొట్టి నారాయణపేట టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. దీంతో జడ్చర్ల జట్టు వరుస మ్యాచ్‌లలో విజయం నమోదు చేసింది. కోచ్‌లు మహేశ్, ముజాఫ్‌లు క్రీడాకారులను అభినందించారు.

క్రైం కార్నర్

మరో వడ్డీ వ్యాపారి అదృశ్యం?

» రూ. 3 కోట్ల వరకు అప్పులు చేసినట్లు ప్రచారం !

అయిజ టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ పట్టణంలో మరో వడ్డీ వ్యాపారి అదృశ్యమైన సంఘటన కలకలం రేపుతుంది. అతడు దాదాపు మూడు కోట్ల రూపాయల అప్పు చేసి ఉడాయించినట్లు సమాచారం. దీంతో అధిక వడ్డీలకు ఆశపడి అతడికి అప్పులిచ్చిన వారు ఆందోళన చెందుతున్నారు. అతడు చాలా ఏళ్లుగా అయిజలో వివిధ రకాల వ్యాపారాలు చేస్తున్నాడు. తనకు పరిచయం ఉన్న వ్యక్తులు, స్నేహితుల నుంచి తరుచూ అప్పులు తీసుకొని మళ్లీ చెల్లించేవాడు. ఈ క్రమంలోనే స్థాయిని మించి అప్పులు చేసిన అతడు వారం రోజుల క్రితం పట్టణాన్ని వదిలి వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. అప్పటి నుంచి ఆ వ్యాపారి ఇంటికి తాళం వేసి ఉంటోంది. అతడికి సంబంధించిన రెండు దుకాణాలు మూసి ఉంటున్నాయి. అప్పులు ఇచ్చిన వారు అతడికి ఫోన్ చేస్తే స్విచాఫ్ వస్తోంది. దీంతో అతడు పరారైనట్లు పట్టణంలో చర్చ కొనసాగుతోంది. అలాగే పది రోజుల క్రితం అయిజ పట్టణంలో మరో వ్యాపారి కోటి రూపాయలు అప్పుచేసి ఐపీ పెట్టాడు. ఏడాది క్రితం ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో అయిజ పట్టణంలో దాదాపు రూ. 50 కోట్లు కొల్లగొట్టారు. రెండేళ్ల క్రితం ఓ బేకరీ నిర్వాహకుడు కూడా కోటి రూపాయల వరకు అప్పులు చేసి పరారయ్యాడు. ఈ సంఘటనలపై మంగళవారం సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది.

కంటైనర్‌లో పశువుల రవాణా

» ఊపిరాడక 3 ఆవులు, ఒక ఎద్దు మృతి

» పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద పట్టివేత



కంటైనర్‌లో తరలిస్తుండగా పోలీసులు కాపాడిన పశువులు

అలంపూరు చౌరస్తా, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ఒకే కంటైనర్‌లో 70 ఆవులను, ఎద్దులు, దూడలను కుక్కి తరలిస్తుండగా ఊపిరాడక మూడు ఆవులు, ఒక ఎద్దు చనిపోయాయి. ఎస్ఐ మహేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బక్రీద్ పండుగ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల సరిహద్దు, జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండలంలోని పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ మంగళవారం పోలీసులు, పశువైద్యాధికారులు ఆంధ్రప్రదేశ్ నుంచి రాష్ట్రంలోకి ప్రవేశించే వాహ నాలను తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో వచ్చిన ఓ కంటైనర్‌ను తనిఖీ చేయగా అందులో 48 కోడె దూడలు, 31 ఆవులు మొత్తం 79 పశువు లను అతి క్రూరంగా ఇరికించి ఎక్కించినట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాటిని హైదరాబాదు నగరానికి తరలిస్తున్న అబ్దుల్ అజీజ్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా ఎండీ ఖలీల్ అనే వ్యక్తి కర్నూలు మార్కెట్‌లో రూ.6.75 లక్షలకు వాటిని కొనుగోలు చేసినట్లు వెల్లడైంది. కంటైనర్లలో కుక్కడం వల్ల ఒక ఎద్దు, 3 ఆవులు చనిపోయాయి. సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

అలంపూరుచౌరస్తా, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండల పరిధిలోని పుల్లూరు శివారులో గుర్తుతెలియని మృతదేహం లభించినట్లు ఎస్ఐ మహేశ్ తెలిపారు. గ్రామ శివారులోని పొలంలో పురుషుడి మృతదేహం పడి ఉన్నట్లు స్థానికులు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి వయసు 40 నుంచి 45 మధ్య ఉండొచ్చని, శరీరంపై దుస్తులు లేవని తెలిపారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే పోలీసులను సంప్రదించాలని కోరారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



బోయ జంగయ్య (ఫైల్)

ఊర్కొండ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ జిల్లా, ఊర్కొండ మండలంలోని ఊర్కొండపేట శివారులో మంగళవారం ఈ సంఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జకినాలపల్లి గ్రామానికి చెందిన బోయ జంగయ్య (36) మరో నలుగురితో కలిసి అడవి పందుల వేటకు వేళ్లాడు. ఊర్కొండపేట శివారులోని రేగిబావి సమీపంలోని పొలం చుట్టూ సంబంధిత రైతుకు తెలియకుండా విద్యుత్ తీగలను అమర్చారు. పందుల వేటలో నిమగ్నమైన జంగయ్య పొరపాటున ఆ తీగలకు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. అతడితో పాటు ఉన్న వారిలో రాజు అనే వ్యక్తి అక్కడే ఉండిపోగా, మరో ముగ్గురు పారిపోయారు. కుటుంబసభ్యులకు సమాచారం అందడంతో వారు అక్కడికి చేరుకున్నారు. అనంతరం మృతుడి భార్య లక్ష్మీకళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కృష్ణదేవ తెలిపారు. మృతదేహన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు.

రెండు బైకులు ఢీకొని ఇద్దరికి గాయాలు

వీపనగండ్ల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొని ఇద్దరు గాయపడ్డారు. వనపర్తి జిల్లా, వీపనగండ్ల మండల పరిధిలోని గోవర్ధనగిరి సమీపంలో మంగళవారం ఈ సంఘటన జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆకుల మోని రాముడు ద్విచక్రవాహనంపై వెలగొండ పెట్రోల్ బంకుకు వెళ్తున్నాడు. చిన్నంబావి మండలం పెద్దదగడ గ్రామానికి చెందిన నరేశ్ ద్విచక్ర వాహనంపై పెబ్బేరు వైపు నుంచి వెళ్తున్నాడు. రెండు వాహనాలు ఎదురెదురుగా వస్తూ గోవర్ధనగిరి సమీపంలో ఢీకొనడంతో ఇద్దరూ గాయపడ్డారు. సమాచారం అందుకున్న ఎస్ఐ రాణి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్షతగాత్రులను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అనన్యసామాన్యం



అనన్యశ్రీ అభినందిస్తున్న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే వంశీచందర్‌రెడ్డి (ఫైల్)

» ఆసియా వాలీబాల్ టోర్నీకి ఎంపిక

» భారత మహిళా జట్టులో చోటు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రతిభావంతులైన క్రీడాకారులకు కొదవ లేదని చాటి చెప్తోంది అనన్యశ్రీ. మక్తల్‌కు చెందిన ఆమె, అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగింది. ఈనెల 7 నుంచి 14 వరకు వియత్నాం హనోయ్‌లో నిర్వహించనున్న ఆసియా టోర్నీలో పాల్గొని భారత మహిళా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నది. కేరళలోని ఖేలో ఇండియా వాలీబాల్ అకాడమీ హాస్టల్‌కు ఆమె ఎంపిక య్యింది. కేరళలో సెయింట్ స్టీఫెన్స్ కళాశాలలో క్రీడా కోటా కింద సీటు సాధించి డిగ్రీ పూర్తి చేసింది. గత ఏడాది క్రీడా కోట కింద పూణేలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో ఉద్యోగం సాధించింది. వాలీబాల్ క్రీడలో రాణిస్తున్న అనన్యశ్రీ ఇటు జిల్లా, రాష్ట్రానికి, అటు దేశానికి పేరు ప్రతిష్ఠలు తెస్తోంది.



మ్యాచ్‌లో బాల్‌ను బ్లాక్ చేస్తున్న అనన్యశ్రీ(ఫైల్)

పొడగరి బాలికలకు శిక్షణ

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా యువజన క్రీడల అధికారి(డీవైఎస్‌వో)గా 2017లో పని చేసిన సత్యవాణి ఆలోచన అనన్యశ్రీ జీవితాన్ని మార్చేసింది. పొడగరి బాలికలకు ప్రత్యేక క్రీడా శిక్షణ కార్యక్రమానికి ఆమె శ్రీకారం చుట్టారు. మక్తల్ పట్టణానికి చెందిన ఆనంద్, వరలక్ష్మీ దంపతుల కుమార్తె అనన్యశ్రీ 160 సెంటి మీటర్ల ఎత్తు ఉండటంతో ఈ శిక్షణ శిబిరానికి ఎంపికయ్యింది. కోచ్ పర్వేజ్‌పాషా వద్ద రెండు నెలల పాటు శిక్షణ పొందింది. ఇలా వాలీబాల్ క్రీడలో రాణిస్తూ రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగింది.



2017లో పొడగరి బాలికల క్రీడా శిక్షణకు ఎంపికైన అనన్యశ్రీని అభినందిస్తున్న అప్పటి కలెక్టర్ రోనాల్డ్‌రోస్, పక్కన డీవైఎస్‌వో సత్యవాణి (ఫైల్)

అంచెలంచెలుగా ఎదిగి..

పంజాబ్ రాష్ట్రంలోని చండీఘడ్‌లో 2018లో నిర్వహించిన జాతీయస్థాయి జూనియర్ నేషనల్స్ టోర్నీలో పాల్గొన్న రాష్ట్ర జట్టుకు అనన్యశ్రీ ఎంపికయ్యింది. 2019లో తమిళనాడు, 2020లో ఆంధ్రప్రదేశ్, 2022లో ఉత్తరాఖండ్, మహారాష్ట్రలలో నిర్వహించిన జాతీయ స్థాయి జూనియర్ వాలీబాల్ టోర్నీల్లో కేరళ జట్టు తరుపున ఆడి ప్రతిభ చాటింది. అస్సాంలో 2023లో నిర్వహించిన సీనియర్ వాలీబాల్ నేషనల్ టోర్నీ, పాండిచ్చేరిలో నిర్వహించిన ఫెడరేషన్ కప్ పోటీల్లోనూ సత్తా చాటింది. చైనాలో ఆగస్టులో నిర్వహించిన వరల్డ్ వాలీబాల్ యూనివర్సిటీ టోర్నీలో పాల్గొనే ఆలిండియా యూనివర్సిటీ జట్టుకు ఎంపికై తొలిసారిగా విదేశీగడ్డపై ఆడింది. గత ఏడాది జనవరిలో నిర్వహించిన ఆల్‌ఇండియా ఉమెన్స్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నీలో పాల్గొని బంగారు పతకం సాధించింది. భారత్ తరుపున ఆడుతూ పతకాలు సాధించటమే లక్ష్యమని అనన్యశ్రీ చెబుతోంది.

10 వికెట్ల తేడాతో మహబూబ్‌నగర్ గెలుపు

» అర్ధసెంచరీతో రాణించిన అబ్దుల్ రాఫె



గెలిచిన మహబూబ్‌నగర్ జట్టుతో ఎండీసీఏ సెక్రటరీ రాజశేఖర్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అండర్-19 ఉమ్మడి జిల్లా వన్‌డే క్రికెట్‌లో మహబూబ్‌నగర్ జట్టు నాగర్‌కర్నూల్‌పై 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సమర్థ పాఠశాల మైదానంలో మంగళవారం నిర్వహించిన మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ - నాగర్‌కర్నూల్ జట్లు తలబడ్డాయి. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన నాగర్‌కర్నూల్ జట్టు 28.5 ఓవర్లలో 70 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జట్టులో చరణ్ 10, లక్ష్మణ్‌యాదవ్ 10 పరుగులు చేశారు. మహబూబ్‌నగర్ బౌలర్లలో నవీన్‌కుమార్ 2, ప్రణవ్ 2, అభినవ్ 2, యువన్ ముద్దసాని 2 వికెట్లు తీసి తక్కువ స్కోర్‌కే నాగర్‌కర్నూల్‌ను అవుట్ చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన మహబూబ్‌నగర్ జట్టు 11.5 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 71 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులో అబ్దుల్ రాఫె 36 బంతుల్లో 11 ఫోర్లతో అర్ధసెంచరీ (52), కార్తిక్ 18 పరుగు లు చేసి నాటౌట్‌గా నిలిచారు. వరుస విజ యాలు సాధించడంపై జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ జట్టుకు అభినం దనలు తెలిపారు. కార్యక్రమంలో కోచ్ అబ్దుల్లా, సీనియర్ క్రీడాకారుడు మన్నాన్ పాల్గొన్నారు.



అర్ధసెంచరీతో రాణించిన అబ్దుల్ రాఫె

వ్యాధుల నివారణపై అవగాహన కల్పించాలి

» జాతీయ నాణ్యత ప్రమాణాల బృందం సూచన

» గగ్గలపల్లి పల్లె దవాఖానా తనిఖీ

» ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ సేవలపై ఆరా



గగ్గలపల్లి పల్లె దవాఖానా వద్ద సిబ్బందితో జాతీయ బృందం సభ్యులు

కందనూలు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, నీళ్ల వీరేచనాలు తదితర వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని జాతీయ నాణ్యతా ప్రమాణాల బృందం వైద్య సిబ్బందికి సూచించింది. నాగర్‌కర్నూల్ మండలం, గగ్గలపల్లి గ్రామంలోని పల్లె దవాఖానాను మంగళవారం డాక్టర్ శరణప్ప ఆధ్వర్యంలో జాతీయ నాణ్యత ప్రమాణాల బృందం ఆకస్మికంగా తనిఖీ చేసింది. దవాఖానాలో ప్రజలకు అందిస్తున్న సేవలపై గత ఫిబ్రవరి నెలలో డాక్టర్ శరణప్ప, డాక్టర్ విపిన్ కార్తీక్, పి.గనిగేరు బృందం సంయుక్తంగా పరిశీలించింది. అప్పుడు అంచనా వేసిన జాతీయ నాణ్యత ప్రమాణాల ప్రకారం క్షేత్రస్థాయిలో వైద్య సేవలు అందుతున్నాయా అని ఆరా తీశారు. గ్రామంలో ఇంటింటికి ప్రజలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మాతా శిశు సంరక్షణ, టీకీకరణ, అధిక రక్తపోటు, మధుమేహ వ్యాధిగ్రస్తులకు ప్రతీ నెల అందిస్తున్న మందుల గురించి తెలుసుకున్నారు. ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు నిర్వహిస్తున్న రికార్డులను, ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసిన డేటాను పరిశీలించారు. కార్యక్రమంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ మంజుల వాణి, పెద్దముద్దునూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వాణి, డీపీవో రేణయ్య, ఏవో అనంతాచారి, క్వాలిటీ మేనేజర్ సంతోష్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పీలు ప్రీతి, డాక్టర్ నీరజ్, ఎంపీహెచ్‌ఈవో ఫసియొద్దీన్, పర్యవేక్షకురాలు జ్యోతి, ఆరోగ్య కార్యకర్త రాజవర్ధన్‌రెడ్డి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ రాజీలేని పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి నాగరాజు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ రాజీలేని పోరాటాలు చేస్తూనే ఉంటుందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రైస్ మిల్లర్ అసోసియేషన్ కార్యాలయంలో ఐదు రోజుల పాటు నిర్వహించే ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర విద్యావైజ్ఞానిక శిక్షణ తరగతులు మూడో రోజు మంగళవారం కొనసాగాయి. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కాస్తున్న ఇప్పటికీ విద్యాశాఖ మంత్రి లేక పోవడం సిగ్గుచేటు అన్నారు. విద్యాశాఖ మంత్రిని నియమించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడుతామన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం అయ్యాయన్నారు. ఈనెల 5న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు రజినీకాంత్, ఉపాధ్యక్షుడు కిరణ్, శ్రీకాంత్ వర్మ, ప్రశాంత్, కన్వీనర్ పూజ, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రశాంత్, భరత్, ఉపాధ్యక్షుడు నందు, రమేశ్, జ్ఞాపిక, ఈశ్వర్, రాజేష్, రాధిక, నవ్య, శ్రీనాథ్ పాల్గొన్నారు.

తైక్వాండోలో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులతో జిల్లా తైక్వాండో సంఘం ప్రధాన కార్యదర్శి సురేందర్‌బాబు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మే 3 (ఆంధ్రజ్యోతి) : మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కేసర్‌లో గత నెల 31 నుంచి ఈనెల 1వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులు రాణించి పతకాలు సాధించారు. రేహాన్‌బాబా, ప్రన్షు వెండి పతకాలు, జానితా ప్రిస్సీ, పవిత్ర, రోహిణి, అమలశ్రీ, ధర్మతేజ, అస్మిత్ కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర కళాశాల మైదానంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సురేందర్‌బాబు వారిని అభినందించారు. తైక్వాండో గుర్తింపు ఉన్న క్రీడ అని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సాయిలు, మాస్టర్లు వర్షిని, లిఖిత్, గాయత్రి, కీర్తి పాల్గొన్నారు.

డిగ్రీ పూర్తికి చివరి అవకాశం

పాలమూరు యూనివర్శిటీ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీ పరిధిలో గతంలో డిగ్రీ (సంవత్సర విధానం)లో ఫెయిలైన విద్యార్థులకు చివరి అవకాశం కల్పిస్తున్నట్లు పరీక్షల నిర్వహణ అధికారి డాక్టర్ కె.ప్రవీణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, అపరాధ రుసుముతో 20వ తేదీ వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు పాలమూరు యూనివర్శిటీ వెబ్‌సైట్‌ను పరిశీలించాలని సూచించారు.

11 నుంచి పీఈసెట్ ఈవెంట్లు

పాలమూరు యూనివర్శిటీ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీలో ఈ నెల 11 నుంచి పీఈసెట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్ సెట్) నిర్వహించనున్నట్లు తెలంగాణ పీఈసెట్ కన్వీనర్ డాక్టర్ ఎస్ఎస్ దిలీప్ తెలిపారు. పీయూలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాలమూరు యూనివర్సిటీలో మొట్టమొదటి సారి టీజీ పీఈసెట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈవెంట్స్ నిర్వహించేందుకు ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నట్లు చెప్పారు. ఫిజికల్ టెస్టుల్లో భాగంగా బాలురకు రన్నింగ్ 100, 800 మీటర్లు, షాట్‌పుట్ 6 కిలోలు, లాంగ్‌జంప్, హైజంప్, మహిళలకు రన్నింగ్ 100, 400 మీటర్లు, షాట్‌పుట్ 4 కిలోలు, లాంగ్‌జంప్, హైజంప్‌తో పాటు బాల్ బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, క్రికెట్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, హాకీ, కబడ్డీ, షటిల్, వాలీబాల్, లాన్‌టెన్నిస్, ఖోఖోల్లో ఒక క్రీడను ఎంచుకొని ఆడాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతీ ఈవెంటుకు 100 మార్కులు ఉంటాయని వివరించారు.

కొనసాగుతున్న జల విద్యుత్ ఉత్పత్తి



దిగువ జూరాల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం

ఆత్మకూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి స్వల్పంగా వరద వస్తున్నందున ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి కొనసాగిస్తున్నట్లు ప్రాజెక్టు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో మూడు యూనిట్లు ప్రారంభించి, 1.428 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి, దిగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో మూడు యూనిట్ల ద్వారా 1.225 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు తెలిపారు. వరద ఉధృతి పెరిగితే మరో మూడు యూనిట్లను ప్రారంభించే అవకాశం ఉందని ఎస్ఈ పేర్కొన్నారు.

రెవెన్యూ సదస్సులు పకడ్బందీగా నిర్వహించాలి

» గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్

» ప్రారంభమైన గ్రామ రెవెన్యూ సదస్సులు



అనంతపురం సదస్సులో దరఖాస్తులను పరిశీలించి అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్

గద్వాల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామ స్థాయిలో భూ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన రెవెన్యూ సదస్సులను పకడ్బందీగా నిర్వహించాలని గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్ ఆదేశించారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి కీలకంగా మారుతుందన్నారు. మంగళవారం ఆయన గద్వాల మండలం అనంతపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సును పరిశీలించారు. దరఖాస్తుల స్వీకరణ, దరఖాస్తుల దారులకు ఇచ్చే రశీదు, రిజిస్ట్రేషన్, ఏ సమస్యలకు సంబంధించి దరఖాస్తు ఇచ్చారని అధి కారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ తమ సమస్య గురించి సంబంధిత ఫారం ద్వారా అధికారులకు అందజేయాలన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం దరఖాస్తుల స్వీకరణ పూర్తి అయ్యే వరకు అధికారులు గ్రామాల్లో ఉండాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, ఆర్డీవో అలివేలు, గద్వాల తహసీల్దార్ మల్లికార్జున్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు

» రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ఎండీ వీపీగౌతమ్, కలెక్టర్ బదావత్ సంతోష్



నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని గగ్గలపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న రాష్ట్ర నిర్మాణ గృహ నిర్మాణ శాఖ ఎండీ వీపీ గౌతమ్, కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు అందాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ఎండీ వీపీగౌతమ్, కలెక్టర్ బదావత్ సంతోష్ ఎంపీడీవోలను ఆదేశించారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లాలో ఎంపిక చేసిన పైలట్ ప్రాజెక్టు గ్రామాలు, వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిపై జిల్లాలోని మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో కలెక్టరేట్‌లో సమీక్షించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని 20మండలాలు, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, కల్వకుర్తి, అచ్చంపేట మునిసిపాలిటీల వారీగా ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ఆరా తీశారు. ఇందిరమ్మ ఇళ్ల వివరాలు అడిగి తెలుసుకుని త్వరగా ఎలా పూర్తి చేయాలో సూచనలు చేశారు. ఈ సందర్భంగా హౌసింగ్ ఎండీ వీపీ.గౌతమ్, కలెక్టర్ బదావత్ సంతోష్‌లు మాట్లాడుతూ పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలనేది రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన ఆశయమని స్పష్టం చేశారు. ఇందిర మ్మ ఇళ్ల గ్రామ కమిటీలు గుర్తించిన వారితోపాటు ఎవరైనా ని రుపేదలు ఉంటే పూర్తి వివరాలు తీసుకుని ఇళ్లు మంజూరు చేయాలని సూచించారు. పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన గ్రా మాలు, వార్డుల్లో లక్ష్యం మేరకు నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. అంతకు ముందు నాగర్‌కర్నూల్ మండలంలోని గగ్గలపల్లిలో కలెక్టర్ బదావత్ సంతోష్‌తో కలిసి హౌసింగ్ ఎండీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దేవసహాయం, పీడీ హౌసింగ్ సంగప్ప, పీడీ డీఆర్‌డీఏ చిన్న ఓబులేష్, డిప్యూటీ సీఈవో గోపాల్‌నాయక్, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు, హౌసింగ్ ఏఈలు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

గుర్తింపు పొందిన డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలి

● వ్యవసాయాధికారి నవీన్‌కుమార్



ధన్వాడ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ గుర్తింపు పొందిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని మండల వ్యవసాయాధికారి నవీన్‌కుమార్ తెలిపారు. నకిలీ విత్తనాలు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం ఫర్టిలైజర్ దుకాణాల్లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నామని ఆయన మంగళవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

మండలంలో నకిలీ విత్తనాలు అమ్మే వారిపై ఏం చర్యలు తీసుకుంటున్నారు?

మండలంలో ఎక్కడ కూడా నకిలీ విత్తనాలు అమ్మకుండా ఇప్పటికే అన్ని ఫర్టిలైజర్స్ దుకాణాలను తనిఖీలు చేపడుతున్నాం. ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటాం.

విత్తనాలను ఎక్కడ కొనుగోలు చేయాలి?

విత్తనాలను ప్రభుత్వ గుర్తింపు పొంది లైసెన్స్ ఉన్న ఫర్టిలైజర్ దుకాణాల్లోనే మాత్రమే కొనుగోలు చేయాలి.

నాణ్యమైన విత్తనాలను ఎలా గుర్తించాలి?

విత్తన బస్తాపై ఉన్న తయారీ తేదీ, గడువు తేదీ, అంకురణ శాతం, శుద్ధత శాతం, బ్యాచ్ నెంబర్, సంస్థ పేరు లాంటి వివరాలను జాగ్రత్తగా పరిశీలించాలి.

దుకాణాల్లో తనిఖీలు చేస్తున్నారా, నకిలీలను గుర్తించారా?

ధన్వాడలో ఉన్న ప్రతీ ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేశాం. ఎక్కడా నకిలీ విత్తనాలు కన్పించలేదు.

పేట యార్డులో
ధాన్యం క్రయ విక్రయాలు

నారాయణపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు మంగళవారం ధాన్యం విక్రయానికి వచ్చింది. ధాన్యం ధరలు ఈ విధంగా ఉన్నాయి.

ధాన్యం	క్వింటాల్	గరిష్ఠ	కనిష్ఠ (రూపాయలలో)
వడ్లు సోనా	141.10	2,111	1,739
వడ్లు హంస	5.40	1,691	1,691
పెసళ్లు	4.41	6,709	3,511
ఎర్ర కందులు	4.90	6,169	6,169

న్యూస్ బాక్స్

భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు

కోస్గి రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులను ప్రతీ గ్రామంలో నిర్వహిస్తున్నట్లు గుండుమాల్ మండల తహసీల్దార్ భాస్కరస్వామి తెలిపారు. మంగళవారం గుండుమాల్ మండల పరిధిలోని అప్పాయపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతుల నుంచి 12 దరఖాస్తులు స్వీకరించారు. ఆర్ఐ వెంకట్రాములు, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌గౌడ్ తదితరులున్నారు.

రైతులు ఫార్మర్ ఐడీ నమోదు చేసుకోవాలి

మక్తల్ రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఫార్మర్ ఐడీ ప్రాజెక్టులో భాగంగా ప్రతీ రైతు వివరాలు నమోదు చేస్తున్నామని ఏఈవో వైష్ణవి తెలిపారు. మండలంలోని కర్ని గ్రామ రైతులు ఆధార్ కార్డు, పట్టాదార్ పాసుబుక్ జిరాక్స్, మొబైల్ ఫోన్‌తో బుధవారం ఉదయం 10:30 గంటలకు మక్తల్ వ్యవసాయ కార్యాలయం వద్దకు రావాలని ఆమె కోరారు.

నామినేటెడ్ పోస్టులు అగ్రవర్ణాలకేనా?

మాగనూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంలో నామినేటెడ్ పోస్టులన్నీ అగ్రవర్ణాలకు కట్టబెడుతున్నారని బీసీ జాగృతి సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ మండిపడ్డారు. మంగళవారం మాగనూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సామాజిక న్యాయం జరగడం లేదని, బీసీలపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే నామినేటెడ్ పోస్టుల్లో బీసీలను భర్తీ చేసి చూపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సమాచార కమిషనర్ నియామకాల్లో సామాజిక న్యాయం పూర్తిగా కొరవడిందని అన్నారు. కులగణన ద్వారా బీసీలకు న్యాయం చేస్తామని ఇచ్చిన హామీ నేటికీ అమలు కాలేదని ఆరోపించారు.

ఆగని ఇసుక అక్రమ రవాణా

● రాత్రి వేళల్లో జోరుగా తరలింపు

కొత్తపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లింగాల్‌చెడ్, నందిగామ, తిమ్మారెడ్డిపల్లి, భూనీడు, నిడ్జింత గ్రామ శివార్లలో ఉన్న వాగుల్లో ఇసుక అక్రమ రవాణా రాత్రివేళల్లో యధేచ్ఛగా కొనసాగుతోంది. పోలీసులు నామమాత్రంగా చర్యలు తీసుకుంటున్నా అక్రమార్కుల ఆగడాలకు మాత్రం అడ్డుకట్ట లేకుండా పోయింది. రాత్రి వేళల్లో ఎక్స్‌కవేటర్ల సహాయంతో ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ఇసుకను తోడేస్తున్నారు. వాహనాలు పొలాల మీదుగా వెళ్తూ మోటార్లను పాడు చేస్తున్నాయని వాపోయారు. సోమవారం రాత్రి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా గమనించిన రైతులు పోలీసులకు సమాచారమందించగా కనీసం అటువైపు చూడకపోవడం గమనార్హం. ఈ విషయమై మద్దూరు ఎస్ఐ విజయ్‌కుమార్‌ను సంప్రదించగా సిబ్బందిని పంపించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కొడంగల్‌లో ఇచ్చిన విధంగానే..
ఇక్కడి రైతులకూ పరిహారం

» మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఊట్కూర్/నర్వ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోయిన రైతులకు సీఎం నియోజకవర్గమైన కొడంగల్‌లో ఎంత పరిహారం ఇస్తారో అదే రకమైన పరిహారం మన రైతులకు అందిస్తానని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో రైతులకు విత్తనాలు పంపిణీ చేసిన అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన భూములు కోల్పోతున్న రైతులకు ఎలాంటి పరిహారం ఇస్తారో అలాంటి పరిహారం సీఎంను అడిగి రైతులకు ఇప్పిస్తానని అన్నారు. పరిహారంతో పాటు అక్కడ ఉద్యోగాలు ఇస్తే ఇక్కడా ఉద్యోగాలు ఇప్పిస్తానని అన్నారు. ప్రస్తుతం రైతులకు నాణ్యమైన విత్తనాలు అందిచడంతో పాటు, సబ్సిడీతో కూడిన విత్తనాలు అందించి వ్యవసాయ అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. బడుగు, బలహీన వర్గాలతో పాటు రైతుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ చింత రవి, ఎంపీవో ఎంఎల్ఎస్ రాజు, ఏవో గణేష్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు బాల్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు సూర్యప్రకాష్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విఘ్నేశ్వర్‌రెడ్డి, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

అదేవిధంగా, నర్వ మండల కేంద్రంలోని రైతువేదికలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మంగళవారం కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. 51 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, 21 మంది బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. అలాగే, ప్రభుత్వం అందజేసిన కంది విత్తనాలను కొందరు రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. వాటిని పండించి ఇతర రైతులకు కూడా అందించాలనే ఉద్దేశంతో ఈ విత్తనాలను అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం యాంకి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసులు, ఏవో అఖిలారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయం పునర్నిర్మాణానికి రూ.7 లక్షల విరాళం అందజేత

మక్తల్ రూరల్ : మక్తల్ పట్టణంలోని యాదవనగర్‌లో కొలువైన పురాతన వేణుగోపాలస్వామి ఆలయాన్ని పునర్నిర్మించి ఈనెల 8న స్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆవిష్కరించారు. అనంతరం ఆలయ పునఃనిర్మాణానికి రూ.7 లక్షల విరాళం అందజేశారు. మూడురోజుల పాటు జరిగే పునఃప్రతిష్ఠ ఉత్సవాలకు మక్తల్ పట్టణ, పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ శ్రీరామ్, కోశాధికారి కట్టా సురేష్, సభ్యులు కోరారు.



ఊట్కూర్‌లో విత్తనాలు అందిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

వేతన బకాయిలు చెల్లించాలి..

తమకు బకాయి ఉన్న రెండు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ తెలంగాణ ప్రగతిశీల మునిసిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్మికులు మంగళవారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి వినతిపత్రం అందించారు. టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు, యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కిరణ్, ఉపాధ్యక్షుడు కొలిమి రాములు, కార్మికులు ఉన్నారు.

అనాథ, బడిబయటి పిల్లలను గుర్తించాలి



జిల్లా అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

» అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

నారాయణపేట టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న అనాథ, బడి బయటి బాలలను గుర్తించడానికి ప్రతీ గ్రామంలో ఆశ వర్కర్, పంచాయతీ కార్యదర్శి అంగన్‌వాడీ టీచర్లతో ఒక కమిటీ ఏర్పాటు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ సూచించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో ఐసీపీఎస్ చైల్డ్‌లైన్ సిబ్బంది, జిల్లా విద్యాధికారి, జిల్లా వైద్యాధికారి, శిశు అభివృద్ధి శాఖ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఏర్పాటుచేసిన కమిటీ ద్వారా గ్రామంలో ఉన్నటువంటి అనాథ కుటుంబాలను గుర్తించి అలాంటి కుటుంబంలో ఉన్నటువంటి పిల్లల డేటాను సేకరించాలన్నారు. ఆ డేటాను విజన్ ఎన్జీవో అభివృద్ధి చేసినటువంటి ఆన్‌లైన్ లింకులో అప్‌లోడ్ చేయాలన్నారు. ఆన్‌లైన్ లింకుకు సంబంధించి విజన్ సంస్థ ట్రైనింగ్ నిర్వహించి వారంలోపల ఆన్‌లైన్ లింకులో అప్‌లోడ్ అయ్యేవిధంగా షెడ్యూల్ చేసుకోవాలని ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు జిల్లాలో ఉన్న నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు డీఆర్‌డీఏ, అంగన్‌వాడీ కార్యకర్తలు, మెప్మా, విద్యాశాఖ తరఫున వలంటీర్లు బాధ్యత తీసుకోవాల్సి ఉంటుందని సూచించారు. సమావేశంలో డీఆర్డీఏ మొగులప్ప, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జయచంద్ర మోహన్, డీఎల్‌పీవో సుధాకర్‌రెడ్డి, జీసీడీవో నర్మద, డీపీవో భిక్షపతి, చైల్డ్ వెల్ఫేర్ కోఆర్డినేటర్ నరసింహ, ఏపీవో అనిల్‌కుమార్, సీడీపీవోలు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలే రైతులకు నిజమైన నేస్తం

మరికల్/మాగనూరు/కోస్గి రూరల్/కొత్తపల్లి/ధన్వాడ/కృష్ణ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): 'నాణ్యమైన విత్తనం.. రైతన్నకు నేస్తం'లో భాగంగా మంగళవారం మరికల్ మండల కేంద్రంలోని రైతువేదికలో ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో రైతులకు నాణ్యమైన విత్తనాలపై అవగాహన కల్పించారు. పీజేటీఎస్ఏయూ శాస్త్రవేత్త అనిల్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. రైతులు పండించిన నాణ్యమైన విత్తనాన్ని గ్రామ స్థాయిలోనే ఇతరులకు ఇవ్వడం ద్వారా కల్తీ విత్తనాల బారిన పడకుండా ఉంటారన్నారు. కార్యక్రమంలో ధన్వాడ పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామారెడ్డి, ఏవో రహమాన్, ఏఈవోలు పరుశురాం, వహీదాబేగం, శివకుమార్, వివిధ గ్రామాల అభ్యుదయ రైతులు పెంటమీది నర్సిములు, పటేల్‌శ్రీను, మల్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులున్నారు.

అదేవిధంగా, మాగనూరు మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన 'నాణ్యమైన విత్తనం, రైతన్నకు నేస్తం' కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఈశ్వర్‌రెడ్డి పాల్గొని, మాట్లాడారు. మండలంలోని ప్రతీ గ్రామంలో ముగ్గురు రైతులకు నాణ్యమైన 35 కిట్లు వరి విత్తనాలు, 25 కిట్లు కంది పంటలకు సంబంధించిన విత్తనాలను పంపిణీ చేసినట్లు ఇన్‌చార్జి ఏవో సుదర్శన్‌గౌడ్ తెలిపారు. పరిశోధన కేంద్రం ద్వారా పంపిణీ చేస్తున్న విత్తనాల సాంకేతికను పాటిస్తే అదే విత్తనాన్ని రెండు, మూడు సంవత్సరాల వరకు వాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, రమేష్‌గౌడ్, అశోక్‌గౌడ్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

గుండుమాల్ మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం విత్తనోత్పత్తిపై శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 'నాణ్యమైన విత్తనం.. రైతన్నకు నేస్తం' కార్యక్రమం ముఖ్య ఉద్దేశాన్ని వారు రైతులకు వివరించారు. అనంతరం వరి, కంది, జొన్న పంటలకు సంబంధించిన విత్తనాల మినీ కిట్స్‌ను రైతులకు అందించారు. శాస్త్రవేత్త శేఖర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, ఏఈవోలు తిరుపతి, హర్షవర్ధన్, నాయకులు పాల్గొన్నారు.

కొత్తపల్లి మండలంలోని లింగాల్‌చేడ్ రైతువేదికలో మంగళవారం ఏవో రమేష్ రైతులకు నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేసి, మాట్లాడారు. ఏఈవో మోహన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ధన్వాడ రైతువేదికలో రైతులకు విత్తనోత్పత్తిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం, ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 27 మంది రైతులకు పాలిటెక్నిక్ శాస్త్రవేత్త డాక్టర్ జేడీ.సరిత కల్తీలేని విత్తనాలను అందించారు. విండో చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి, వ్యవసాయాధికారి నవీన్‌కుమార్, ఏఈవోలు సైమన్, భరద్వాజ్, జైన్‌సింగ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కృష్ణ మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో మంగళవారం పాలెం వ్యవసాయ శాస్త్రవేత్త డా.ఈశ్వర్‌రెడ్డి రైతులకు విత్తనాలు పంపిణీ చేసి, మాట్లాడారు. ఏవో సుదర్శన్‌గౌడ్, ఏఈవో అభిలాష్, రైతులు పాల్గొన్నారు.



మరికల్‌లో నాణ్యమైన విత్తనాలు అందజేస్తున్న శాస్త్రవేత్త అనిల్‌కుమార్



కొత్తపల్లి మండలం ఎక్కమేడు రైతువేదికలో విత్తనాలను పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలి

» కోస్గి మునిసిపల్ కమిషనర్ నాగరాజు

కోస్గి / నారాయణపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోస్గి మునిసిపల్ కమిషనర్ నాగరాజు ప్రజలను కోరారు. మంగళవారం వందరోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఇంటింటి చెత్త సేకరణ చేపట్టారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం, తడి చెత్త నుంచి ఎరువును తయారు చేయడంపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడకుండా బట్ట సంచుల వాడకం, నీటి సరఫరాపై ప్రజలకు వివరించారు. మురుగునీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్, మెప్మా సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

అదేవిధంగా, నారాయణపేట మునిసిపాలిటీ పరిధిలో మునిసిపల్ సిబ్బంది తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ భోగేశ్వర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు, ఎన్విరాల్‌మెంట్ ఇంజనీర్ భరత్ మాట్లాడారు. ప్రతీ ఒక్కరు ప్లాస్టిక్‌ను వాడకుండా బట్ట సంచులు ఉపయోగించాలన్నారు.



పేట మునిసిపాలిటీలో తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న ఎన్విరాల్‌మెంట్ ఇంజనీర్ భరత్



కోస్గి మునిసిపాలిటీలో స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ నాగరాజు

ఘనంగా పోల్కమ్మ దేవత జాతర



కొత్తపల్లి మండల కేంద్రంలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

నారాయణపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జంగిడిగడ్డలో కొలువుదీరిన పోల్కమ్మ దేవత జాతర ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. భక్తులు బోనం కుండలతో ఆలయానికి చేరుకొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

● మక్తల్ రూరల్ : మక్తల్ మండలంలోని పసుపుల గ్రామంలో మంగళవారం లింగమయ్య జాతరను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా గ్రామస్థులు బోనాలు సమర్పించారు. అనంతరం ఆలయం వద్ద అర్చకులు జల్ది బిందె తీసుకువచ్చి స్వామివారికి అభిషేకం చేశారు. ఆ తర్వాత పూజలు నిర్వహించారు.

అలాగే, మక్తల్ పట్టణంలోని రాయచూరు రోడ్‌లో కొలువై ఉన్న మారెమవ్వ, కేశవనగర్‌లో కొలువైన కెంచమవ్వ బోనాల వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. దండు గ్రామంలో నిర్వహించిన మారెమ్మ జాతరకు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

● కొత్తపల్లి మండలంలోని భూనీడు, దుప్పటిఘట్టు, కొత్తపల్లి గ్రామంలో మంగళవారం పోచమ్మ బోనాలను ప్రజలకు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మహిళలు బోనాలతో తరలివచ్చి ప్రత్యేకంగా వండిన నైవేద్యాన్ని గ్రామ దేవతకు సమర్పించారు.

● మద్దూర్ మండల కేంద్రంలో గ్రామ దేవత బోనాల ఉత్సవాన్ని ప్రజలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా బయలుదేరి గ్రామ శివారులోని అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. కోళ్లను కోసి తమ మొక్కుబడులను చెల్లించుకున్నారు.

ఇంటర్‌లో అడ్మిషన్లు పొందండి

కోస్గి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కోస్గి మండలంలోని కేజీబీవీలో ఇంటర్‌లో అడ్మిషన్లు పొందాలని ప్రిన్సిపాల్ విజయ అన్నారు. మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ 20025-26 విద్యా సంవత్సరానికిగాను మండల పరిధిలోని నాచారం గ్రామంలో ఉన్న కేజీబీవీలో కొత్తగా ఇంటర్మీడియట్ ప్రారంభమైందని తెలిపారు. సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సుల్లో చేరేందుకు పదో తరగతి పాస్ అయిన విద్యార్థినులు అడ్మిషన్లు పొందాలన్నారు.

రాష్ట్ర స్థాయి విద్యాశాఖ శిక్షణకు పీఈటీ రూప

మక్తల్ రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో మండల విద్యాశాఖ అధికారులకు ఇచ్చే రాష్ట్ర స్థాయి శిక్షణకు మక్తల్ మండలం కర్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పీఈటీ రూప ఎంపికైంది. పాఠశాలలో వ్యాయామ విద్య, కోకరిక్యులర్ ఆక్టివిటీస్‌పై శిక్షణ ఉంటుందని తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన పీడీ రూపను కర్ని పాఠశాల జీహెచ్‌ఎం వెంకటయ్య, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు అభినందించారు.

సర్దుబాటుకు ఉపాధ్యాయుల విముఖత

» జిల్లాలో 502 ప్రభుత్వ పాఠశాలలు, 2,290 మంది ఉపాధ్యాయులు

» ప్రవేశాల సమయాల్లో తగదంటున్న ఉపాధ్యాయ సంఘాలు

నారాయణపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): 2025-26 కొత్త విద్యా సంవత్సరం ఈనెల 12 నుంచి ప్రారంభం కానుంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల సర్దుబాటుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఈనెల 13 లోపు సర్దుబాటు ప్రక్రియ పూర్తి చేయాలని రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. విద్యార్థులు తక్కువగా ఉన్నచోట నుంచి ఎక్కువగా ఉన్నచోటుకు ఉపాధ్యాయులను పంపించాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన పూర్తి అధికారాలను కలెక్టర్‌లకు అప్పగించింది. ఈ ప్రక్రియ పూర్తిచేసి కేటాయించిన పాఠశాలల్లో ఉపాధ్యాయులు చేరిన తర్వాత పూర్తి వివరాలతో ఈనెలాఖరు వరకు విద్యాశాఖకు నివేదికలు పంపించాలి. అయితే ఉపాధ్యాయ సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పాఠశాలల్లో ఏటేటా తగ్గిపోతున్న విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు ఈ ఏడాది ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని గత ఏడాది యుడైస్ వివరాల ఆధారంగా సర్దుబాటు వద్దని బడిబాట నిర్వహించిన అనంతరం అడ్మిషన్ల ప్రక్రియ ముగిసిన తర్వాత విద్యార్థుల సంఖ్యను బట్టి సర్దుబాటు ప్రక్రియ చేస్తే బాగుంటుందని అంటున్నారు. 60 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు ఎలా బోధిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఒకటి నుంచి ఐదు తరగతులకు 18 సబ్జెక్టులు ఇద్దరు ఎలా బోధిస్తారని, పిల్లలకు ఏమేరకు న్యాయం జరుగుతుందని వారంటున్నారు. బోధనతో పాటు, వివిధ రకాల నివేదికలు సైతం సిద్ధం చేయాల్సి ఉంటుందని చెబుతున్నారు. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతీ తరగతికి ఓ ఉపాధ్యాయుడిని కేటాయించాలని కోరుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 339, ప్రాథమికోన్నత పాఠశాలలు 85, ఉన్నత పాఠశాలలు 76, ఎయిడెడ్ పాఠశాలలు రెండు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 55,278 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. జిల్లాలో 2,290 మంది ఉపాధ్యాయులు ప్రస్తుతం పనిచేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయుల కొరత ఉందని ఇంకా దాదాపు 220 మంది ఉపాధ్యాయులు జిల్లాకు అవసరం అని జిల్లా విద్యాశాఖ అధికారులు చెప్పుకొస్తున్నారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశాలకు అనుగుణంగా ప్రక్రియ జరుగుతుందని, పాఠశాలల వారీగా విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల సంఖ్యల నివేదికలు సిద్ధం చేయాల్సి ఉందని చెబుతున్నారు.

సర్దుబాటు విధానాన్ని వ్యతిరేకిస్తున్నాం..



బడిబాట సమయం, పాఠశాలల పునఃప్రారంభ సమయం, అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతున్న ప్రస్తుత తరుణంలో ఈ ప్రక్రియ చేయడం వల్ల కొత్త అడ్మిషన్‌లు రావడం కష్టం అవుతుంది. ఎక్కడైనా బోధన ఇబ్బంది ఉంటే అక్కడ విద్యా వలంటీర్‌ను తక్షణమే నియమించాలి. ఉన్నత పాఠశాలల్లో అక్కడక్కడా ఉన్న ఖాళీలలో విద్యా వలంటీర్లను నియమించాలి.

- వై.జనార్దన్‌రెడ్డి, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు, నారాయణపేట

బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్లు

» కృష్ణ మండలానికి శ్రీనివాస్

» మాగనూరు మండలానికి నాగలక్ష్మి



బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్



బాధ్యతలు చేపట్టిన నాగలక్ష్మి

కృష్ణ/మాగనూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కృష్ణ మండల తహసీల్దార్‌గా శ్రీనివాస్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇన్‌చార్జి తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న పుష్పలత మక్తల్ మండలానికి డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. శ్రీనివాస్ నర్వ నుంచి కృష్ణ మండల కేంద్రానికి బదిలీపై వచ్చారు.

అలాగే, మాగనూరు తహసీల్దార్‌గా నాగలక్ష్మి మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గండీడ్ తహసీల్దార్‌గా పనిచేసిన నాగలక్ష్మి మాగనూరు మండలానికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ మండలంలో ప్రజలు, రైతుల సమస్యలు పరిష్కరిస్తూ, అందుబాటులో ఉంటానన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నిడ్జింత పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు

కొత్తపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిడ్జింత జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతి మొదటి బ్యాచ్ 1995-96లో చదివిన విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. వారి గుర్తుగా దీపికలను అందించారు. అదేవిధంగా వారు బోధించిన పాఠాలను గుర్తు చేసుకున్నారు. చిన్ననాటి మిత్రులు చాలా సంవత్సరాల తర్వాత కలుసుకొని అప్పటి తీపి గుర్తులను నెమరువేసుకున్నారు. అప్పటి ప్రధానోపాధ్యాయుడు బుచ్చిరెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, గోవిందరెడ్డి, నారాయణ, అనంతరెడ్డి, పూర్వ విద్యార్థులు రమేష్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, రాజశేఖర్‌రెడ్డి తదితరులున్నారు.

మితిమీరిన వేగంతో వాహనాలు నడుపొద్దు

నారాయణపేట న్యూటౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, మితిమీరిన వేగంతో వాహనాలు నడుపొద్దని ఏఎస్ఐ ఆంజనేయులు అన్నారు. మంగళవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో పేట పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేనివారికి జరిమానా విధిస్తూ వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనాలు నడుపొద్దని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, హెల్మెట్ ధరించాలని, లైసెన్స్, ఇతరత్రా పత్రాలు వెంట ఉంచుకోవాలని, కారు అద్దాలకు బ్లాక్ ఫిలిం ఉపయోగించొద్దని, సీట్ బెల్ట్ ధరించాలని తదితర సూచనలు చేశారు.